## కందిలో ఆయూష్ గ్రామ్

**కంది, నవంబరు 11, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కందిలో శుక్రవారం ఆయూషన గ్రామ్ 9వ విడత కార్యక్రమాన్ని పురష్కరించుకుని ప్రభుత్వ నిజామియా టిబ్బి కళాశాల ఆధ్వర్యంలో యునానీ వైద్య శిబిరంను మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ ఎంఏ పారూఖీ నేతృత్వంలో దీర్ఘ కాలిక వ్యాధులతో (మోకాళ్ల నొప్పులు, నడుపు నొప్పులు, కిడ్ని సమస్యలు) అవస్థలు పడుతున్న వారికి కప్పింగ్ థెరపీ పద్దతిలో వైద్య చికిత్సలు అందచేశారు. మండల పరిషత్ కార్యాలయంతో పాటు గ్రామంలోని ప్రాథమిక హెల్త్ సెంటర్, చావిడిల ఆదవరణలో రోగులకు చికిత్సలు అందచేశారు. గ్రామంలో 113 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ ఫారూఖీ పేర్కొన్నారు. హైద్రాబాద్‌కు చెందిన ప్రభుత్వ నిజామియా టిబ్బి కళాశాల వైద్యులు ఏశం ఫారూఖి, సర్వే డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడి డాక్టర్ శేహబాజ్ ఆహ్మద్, ప్రొఫెసర్ డాక్టర్ యంఏ లతీఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉర్మిల, డాక్టర్ శాహీన్, సంగారెడ్డి ఆయూష్, వైద్య బృందం, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నట్లు క్యాంప్ ఇంచార్జి డాక్టర్ శాంసుందర్ ప్రసాద్, డాక్టర్ నర్మదా షిండేలు పేర్కొన్నారు.




## పాతపగతో యువకుడి దారుణహత్య

**సంగారెడ్డి, నవంబర్ 11, ప్రభాతవార్త:** శుక్రవారం పాతపగల కారణంగా దారుణంగా హత్య గావించబడిన సంఘటన చిన్నచెల్మెడలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం చిన్నచెల్మెడ గ్రామానికి చెందిన తలారి ప్రవీణ్, బేగరి ఆనంద్‌లు గతంలో మంచి స్నేహితులుగా ఉండేవారని, వారిద్దరి మధ్యన ఏం జరిగిందే కానీ, ఆనంద్ ప్రవీణ్‌ను రెండు సంవత్సరాల క్రితం గ్రామశివారులోని పత్తి చేనులో నరికిచంపిన విషయం అందరికి తెలిసిందే. దీనికి ప్రతికారంగా ప్రవీణ్ కుటుంబం ప్రాణానికి ప్రాణం తీయాలనే కసితో సమయంకోసం వేచిచూశారు. శుక్రవారంఆనంద్ ఒంటిరిగా తిరుగుతున్న సమాచారం తెలుసుకొని ప్రవీణ్ కుటుంబ సభ్యులు మారణాయుధాలతో వెళ్లి ఆనంద్‌ను అతికిరాతకంగా నడిరోడ్డుపై తల,మెండెం, చేతులు వేరు వేరుగా నరికివేశారు. తన కొడుకు ప్రవీణ్‌ను చంపిన ఆనంద్ తమకళ్లముందు తిరగడాన్ని జీర్ణించుకోలేక హత్య చేసినట్లు పోలీసుల ముందు నిందితులు ఒప్పుకున్నాట్లు తెలిసింది. ఘటన స్థలాన్ని సిఐ పరిశీలించారు. మృతుడు బంధువులు ఫిర్యాదు మేరకు నిందితులైన తలారి అంబయ్య, స్వరూప, తలారి ప్రభుదాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చల్లా రాజశేఖర్ తెలిపారు.

### నీతి నిజాయితీగా విధులు నిర్వహించి
# ప్రజల మన్ననలు పొందాలి
### ఇంచార్జి సీపీ రమణకుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రతి నెల నమోదైన కేసులలో 50 శాతం కేసులను అ నెలలోనే తగ్గించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఇంచార్జి సీపీ రమణకుమార్ పోలీసు అధికారులను అదేశించారు. సీపీ కార్యాలయంలో శుక్రవారం సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సీసీ నెంబర్లు తీసుకోవాలన్నారు. నేర చేదన కంటే నేర నివారణ చాలా ముఖ్యమన్నారు. ప్రోయాక్టివ్ పోలీసింగ్ పై అధికారులు, సిబ్బంది దృష్టిసారించాలన్నారు. ప్రతి కేసులో పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నీతి నిజాయితీగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. మహిళలు, మైనర్ బాలికలపై జరుగుతున్న అనేక రకాల కేసులలో నేరస్థులపై కఠినంగా వ్యవహారించాలని అదేశించారు. 2020, 2021వ సంవత్సరాలలో పరిశోధనలో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. టార్గెట్ పెట్టుకొని పెండింగ్‌లో ఉన్న కేసులను తగ్గించాలన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు మహేందర్, రమేష్, సతీష్, ఫణిందర్, రవీందర్‌రాజు, వీరా ప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌లు, కిరణ్, సంజయ్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

## నేడు పిఎం ఎరువుల కర్మాగారాన్ని జాతికి అంకితం చేసే కార్యక్రమం
### -బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్

**మెదక్ అర్బన్, నవంబర్11 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని ద్వారకా గార్డెన్స్‌లో శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రామగుండం ఎరువుల కర్మాగారాన్ని జాతికి అంకితం చేసే కార్యక్రమం ప్రత్యక ప్రసారం చేయడబడుతుందని, కావున ఈ కార్యక్రమానికి ప్రతి కార్యకర్త, బూత్ స్థాయి అధ్యక్షులు మొదలుకొని మండల స్థాయి అధ్యక్షులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, రైతులు, నియోజకవర్గ ప్రజలు అందరూ పాల్గొని వీక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మెదక్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమంలో రైతులు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో స్వయంగా మాట్లాడే అవకాశం ఉంటుందని, కావున తప్పకుండా రైతులతో సహా అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, జిల్లా నాయకులు జనార్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కల్కి నాగరాజు తదితరులు ఉన్నారు

## పోడు భూముల సర్వే పరిశీలన ఈ నెల 15 లోగా పూర్తి చేయాలి
### మంత్రి సత్యవతి రాథోడ్

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 11, ప్రభాతవార్త:** శుక్రవారం హైదరాబాదు నుండి మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి ఆయా ఉన్నతాధికారులతో కలిసి పోడు భూముల సర్వే వెరిఫికేషన్ గ్రామ సభలు, తీర్మానాలు, డివిజన్ స్థాయి కమిటీ సమావేశాలు, ఆయా పనుల పురోగతి తదపరి అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపులు కలెక్టర్లు, అటవీశాఖ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోడు భూములకు సంబంధించి నిబంధల మేరకు సర్వే వెరిఫికేషన్ పూర్తియిందని తెలిపారు. ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ నెలాఖరు లేదా డిసెంబర్ మొదటివారంలో పోడుపట్టాలు ఇవ్వడానికి పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆయా శాఖల అధికారులు అర్హులైన వారికి పోడు పట్టాలు అందించేలా ప్రణాళికతో పనిచేయాలన్నారు. జిల్లాలో 3479:9 ఎకరాలలో పోడుపట్టాల కోసం 3903 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ సీఎస్‌కు తెలిపారు. అందులో గిరిజనులు 2,161 మంది కాగా, ఇతరులు 1742 మంది ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలో వందశాతం సర్వే, వెరిఫికేషన్ పూర్తియిందని తెలిపారు. అదే విధంగా వందశాతం గ్రామసభలు తీర్మానాలు పూర్తియినట్లు కలెక్టర్ తెలిపారు. సబ్ డివిజన్ లెవెల్ కమిటీ సమావేశాలు ఈ ననెల 15 లోగా పూర్తి చేయడానికి ప్రణాళిక ఖరాలు చేసామన్నారు. ఈ నెల 17న జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అన్నింటినీ పూర్తిచేసి నిర్ణీత సమయంలోగా పోడు పట్టాలు అందించడానికి సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌రెన్సో జిల్లా నుండి అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిఎఫ్ఐ శ్రీధర్ రావు, డిపిఓ సురేష్ మోహన్, సంగారెడ్డి డిఎస్‌పి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, గిరిజన సంక్షేమశాఖ అదికారులు పాల్గొన్నారు.

## శబరిమలైను తలపిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయం
### -ఆలయాన్ని నిర్మించిన మల్లారెడ్డికి భక్తులు అభినందనలు

**శివ్వంపేట, నవంబర్11 ప్రభాతవార్త:** దేశంలోనే ప్రముఖ పుణ్య క్షేత్రంగా పిలువబడే కేరళ రాష్ట్రంలోని శబరిమలైలో వెలసిన శ్రీ హరిహర నందన అయ్యప్ప స్వామి దేవాలయం ఉన్న విషయం అందరికీ తెలిసిందే. కార్తీక మాసంలో లక్షలాదిగా అయ్యప్ప స్వామి మాలాధారులు కేరళ రాష్ట్రానికి వెళ్లి స్వామి వారికి ఇరుముడిని సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే తెలంగాణ రాష్ట్రంలోని హైరాబాద్ శివారులో గల పూడూరు గ్రామంలో శబరిమలైను తలపించే విధంగా తన శాయశక్తులా కృషి చేసి కోట్లాది రూపాయులు వచ్చించి శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయాన్ని నిర్మించిన అదే గ్రామానికి చెందిన స్వర్గీయ రొండ బుచ్చిరెడ్డి, లక్ష్మీ దంపతుల కుమారుడు రొండ మల్లారెడ్డి భక్తి స్వభావమిదని రాష్ట్ర ప్రజలు అంటున్నారు. పూడూరు అయ్యప్ప స్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు రొండ మల్లారెడ్డి అన్ని వసతులు దగ్గరుండి కల్పిస్తున్నారని భక్తులు అంటున్నారు. ఆయన చిన్ననాటి నుండే భక్తి స్వభావం, ప్రజాసేవ సంకల్పం గల వ్యక్తి అని అనేక మంది అంటున్నారు. మాలాధారణ ధరించిన వందలాది అయ్యప్ప భక్తులకు అక్కడే భోజన వసతి కల్పించడం మల్లారెడ్డి గొప్పతనం. రాష్ట్రంలోని అన్ని జిల్లా నుండి అనేక మంది అయ్యప్ప మాలాధారు లు పూడూరు అయ్యప్ప దేవాలయాన్ని దర్శించుకొని పునీతులవుతున్నారు. ప్రతి సంవత్సరం ప్రముఖ వ్యాపారవేత్త, గురు స్వామి రొండ మల్లారెడ్డి వివిధ రాష్ట్రాల నుండి పీఠాధిపతులను, గురు స్వాములను ఆహ్వానిస్తూ ఈ ప్రాంతంలో పెద్దఎత్తున అయ్యప్ప స్వామి మహా పడిపూజను నిర్వహిస్తున్నారు. మల్లారెడ్డి భక్తిభావాన్ని చూస్తూ పలువురు ప్రశంసిస్తున్నారు.


పూడూరులోని శ్రీ హరిహర నందన అయ్యప్ప స్వామి దేవాలయం

# మహిళలు కలలను సాకారం చేసుకోవాలి
### అడిషనల్ డీఆర్‌డీవో భీమయ్య

**కొల్చారం, నవంబర్11 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొల్చారంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మండల సమైక్య ఆధ్వర్యంలో జరిగిన మోడల్ మండల సమాఖ్య విజన్ బిల్డింగ్ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అడిషనల్ డీఆర్‌డీవో భీమయ్య హాజరై ప్రతి సభ్యురాలికి కలలు ఉండాలని, వారి కలలను గ్రామ సంఘం వారిగా సాకారం చేసుకోవడానికి ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. మహిళలు తమ కాళ్ల మీదు తాము నిలబడటానికి ఇది సహకరిస్తుందని, మహిళలు ఆర్థికంగా, సాంఘికంగా, అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ఈ కళలకు వీరు రాబోయే ఐదు సంవత్సరాల్లో పకడ్బందీ ప్రణాళికలు రచించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు జరుగుతున్న ప్రణాళికలను మానిటరింగ్ చేసుకుంటూ ఒక ఆదర్శంతమైన, మంచి ఆర్థిక పుష్టి కలిగిన సమైక్యగా ఎదిగేందుకు అవకాశం కలదని తెలిపారు. మహిళలు ఆరోగ్యం పెపొందించుకోవడానికి పౌష్టికాహారం తీసుకోవానలి, కల్తీ లేని ఆహారం తీసుకోవాలని, అంతే కాకుండా మండలం లో మాతా శిశు మరణాలు జీరో శాతం చేయుటకు ప్రతి మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ జరగాలని, అంతే కాకుండా ప్రతి మహిళ జీవనోపాధి మెరుగుపరుచుకోవడానికి అనేక రకాలైన ఆర్థిక కూర్పు కార్యక్రమాలు చేపట్టాలని, దానిలో భాగంగా మహిళలు వారి ఇష్టానికి అనుకూలంగా ఒక జీవనోపాధి, దాని ఎంత నిరంతర ఆదాయం వచ్చుటకు ప్రణాళిక రచించుకోవాలని తెలిపారు. ప్రతి మహిళా రక్తహీనతతో బాధపడకుండా జయించుటకు కావాల్సిన కిచెన్ గార్డెన్ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో అమలు చేయాలని, వాటిని సరిగ్గా వినియోగించుకొనుటకు ప్రతి మహిళ ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ వెంకటేశం ఆర్‌పీటీ, డీపీఎంలు జాన్‌కెనడీ ఫ్రమ్ పీజీఎన్ ప్రకాష్ నాన్ ఫార్మ్ మోహన్ బ్యాంక్ లింకేజీ వెంకట్, ఏపీఎం దైవ సుశిల్వ,డీఎంజీ దత్తు, సీసీ వెంకటేశం, విజయ, సబిత, వీవోలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న భీమయ్య, హాజరైన మహిళలు

### దళితులకు సంక్షేమ పథకాలు బిక్షగా కాదు..
# రాజ్యాంగ హక్కుగా అమలు చేయాలి
### దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్

**రామాయంపేట, నవంబర్ 11, ప్రభాతవార్తః** దళితులకు విద్య, వైద్యం, సంక్షేమ అభివృద్ధి పథకాలను బిక్షగా కుకుండా రాజ్యాంగ హక్కుగా అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ పిలుపునిచ్చారు. రామాయంపేట లో జైభీమ్ సంఘం నిర్వహించిన అలైబలై కార్యక్రమంలో శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని రాజ్యాంగ పీఠికను గుండెమీద చేయివేయించి ప్రమాణం చేసి ప్రసగించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జై భీమ్ యుద్ధ నినాదాన్ని పల్లె పల్లెన ప్రతిగుండెకు చేరాలన్నారు. భారత రాజ్యాంగ పీఠికలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం ప్రతి ఒక్కరికి అందేవిధంగా ప్రయత్నించాలన్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి ఇంటికి చేర్చాలని కోరారు. ప్రభుత్వం విద్య, వైద్య వ్యవస్థలను విధ్వంసం చేసి పేదలకు దూరం చేస్తున్న పాలకుల నిర్లక్ష్య, వివక్షలను ప్రశ్నించాలన్నారు. రాజ్యాంగం వెలుగులో వచ్చిన హక్కులు, చట్టాలు, పథకాలపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణను రూపొందించాలని సూచించారు. దళితబంధు పథకాన్ని ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. ఎస్సీ కార్పోరేషన్ పథకాలకు బ్యాంకు లింకేజిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఆకలి, అవమానాలకు, అన్యాయాలకు గురవుతున్న బాధితులకు అండగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగ వ్యతిరేకమైన ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు జెల్ల సుధాకర్, జర్నలిస్టు నాగరాజు, భూమన్న, జైభీమ్ సంఘ నేతలు పాతూరు రాజు, ఉషనగళ్ల మురళి, దుబాషి సంజీవ్, జర్నలిస్టు పెంటయ్య, లద్ద నర్సింలు, కొల్చారం యాదగిరి, దయాసాగర్, ప్రసాద్, సిద్దన్న, దండోల్ల సామెల్, కల్లూరి సంజీవ లక్ష్మణ్, మాసాయిపేట మల్లేశం, జనార్ధన్, కొమ్మాట సుధాకర్, శ్రీనివాస్ లాలూ, రాజు, రమేష్, పద్మారావు, మల్లేష్, సర్పంచ్‌లు, బిసి సంఘం గంగారం, అనుముల రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగలకు రిమాండ్
### ఎనిమిది వాహనాలు స్వాధీనం


దొంగలను తరలిస్తున్న పోలీసులు

**నిజాంపేట, నవంబర్ 11, ప్రభాతవార్తః** జల్సాలకు అలవాటుపడి బైకు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను నిజాంపేట పోలీసులు పట్టుకున్నారు. నిజాంపేట మండలంలో గత మూడు నెలలుగా వరుస బైక్ చోరీలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను పట్టుకుని విచారించగా వారిని దొంగలుగా గుర్తించారు. కోనారావుపూఏట మండలం మట్టుపల్లి గ్రామానికి చెందిన పల్లపు తిరుపతి అలియాస్ కార్తీక్, నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన గండికోట నవీన్ అనే ఇద్దరు యువకులు చోరీలకు పాల్పడుతున్నారని, నిందితుల వద్దనుండి 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట, సిరిసిల్లా, సైబరాబాద్ పరిధిలో వీరిపై పలుకేసులు నమోదయ్యాయని ద్విచక్ర వాహనాల చోరీకేసులో నిందితులను అరెస్టు చేసి గురువారం రోజున రిమాండ్‌కు తరలించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎఎస్ఐ ప్రతాప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో బోల్తా

- నలుగురు చిన్నారులకు గాయాలు
- మద్యం మత్తులో ఆటో నడిపిన డ్రైవర్
- భయంతో విద్యుత్ స్తంభం ఎక్కిన ఆటో డ్రైవర్

**గజ్వేల్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న చిన్నారులను సాయంత్రం ఆటోలో వారి స్వగ్రామానికి తీసుకెళ్తున్న క్రమంలో ఆటో బోల్తాపడిన సంఘటన పట్టణంలోని బాయ్స్ ఎడ్యుకేషన్‌హబ్ వద్ద చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వర్గల్ మండలం మైలారం గ్రామానికి చెందిన చిన్నారులు కుమ్మరి శాన్విక, కృత్విక, అన్విషిత, అశ్వినిలు గజ్వేల్ పట్టణంలోని నలంద స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారు. శుక్రవారం ఉదయం పల్లెపహాడ్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ నర్సింలు ఆటోలో రోజుమాదిరిగానే పాఠశాల నుండి సాయంత్రం మైలారంకు వెళ్తున్నారు. ఆటో డ్రైవర్ మద్యం సేవించి ఉండడంతో గజ్వేల్ పట్టణ శివారులోని బాలుర ఎడ్యుకేషన్‌హబ్ వద్ద ఆటో బోల్తాపడింది. దీంతో చిన్నారులు శాన్విక, కృత్వికలకు తీవ్ర గాయాలు కాగా అన్విషిత, అశ్వినిలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరగడంతో మద్యం మత్తులో ఉన్న నర్సింలు జనాలు కొడుతారనే భయంతో విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. దీంతో అక్కడ ఉన్న జనం పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న పోలీసులు నర్సింలును అదుపులోకి తీసుకొని చిన్నారులకు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై నలంద స్కూల్ యాజమాన్యాన్ని వివరణ కోరగా పిల్లల తల్లిదండ్రులు ప్రైవేట్ ఆటోలో వారి చిన్నారులకు పాఠశాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు


విద్యుత్ స్తంభం ఎక్కిన ఆటో డ్రైవర్ నర్సింలు

## విద్యుత్ షాక్‌తో సబ్ స్టేషన్ ఆపరేటర్ మృతి
### - లైన్‌మెన్ సుధాకర్ ఆదేశాల మేరకే మరమ్మతులు స్థానికుల ఆరోపణ


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

**కొల్చారం, నవంబర్11 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో సబ్ స్టేషన్ ఆపరేటర్ మృతి చెందిన సంఘటన కొల్చారం మండలం పైతర గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, కొల్చారం ఎస్ఐ సార శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం రంగంపేట గ్రామానికి చెందిన గడ్డమీది సిద్ధిరాములు (46) పైతర సబ్ స్టేషన్‌లో కొన్ని నెలలుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే గత రెండు రోజుల క్రితం పైతర్ సబ్ స్టేషన్‌లో త్రీఫేజ్ ఫిల్టర్ చెడిపోవడంతో పైతర గ్రామ పంచాయతీ మోటార్లు నడవక గ్రామంలో త్రాగునీటి ఎద్దడి నెలకొంది. దింతో విద్యుత్ అధికారులు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా కోసం రంగంపేట సబ్ స్టేషన్ ఫిల్టర్ నుంచి విద్యుత్ సరఫరా చేశారు. అయితే విద్యుత్ కనెక్షన్లు తారుమారు కావడంతో లైన్‌మెన్ సుధాకర్ ఆదేశాల మేరకు ఆపరేటర్‌గా పనిచేస్తున్న సిద్ధిరాములు వాటిని సరి చేసేందుకు పైతర శివారులోని పటేల్ చెరువు కట్ట వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మత్తులు చేసేందుకు వెళ్లాడు. మరమ్మత్తులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్ఐ సార శ్రీనివాస్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు అభితేజ, కూతురు శ్రీవాణి ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై పైతర గ్రామ పంచాయితీ పాలకవర్గం సభ్యులు స్పందిస్తూ విధి నిర్వహణలో గ్రామానికి చేసిన సేవలను గుర్తించి ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. విద్యుత్ షాక్ గురైను సిద్ధిరాములు కుటుంబాన్ని విద్యుత్ శాఖ అధికారులతో పాటు, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రంగంపేట సర్పంచి బండి సుజాత రమేష్, ఎంపీటీసీ గోకని మాధవి రాజాగౌడ్, పైతర సర్పంచి వెల్మకన్నె సంతోష ఎల్లేశం, ఎంపీటీసీ ఆరుట్ల ఎల్లయ్య, యువ నాయకులు రవితేజారెడ్డిలు ప్రభుత్వాన్ని కోరారు.

# అంతర్గత సిసి రోడ్లకు రూ.22 కోట్లు మంజూరు

**గజ్వేల్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లోని వార్డుల్లో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి సిఎం కెసిఆర్ రూ.22 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి మరియు పాలకవర్గం మంత్రి హరీశ్‌రావును తన నివాసంలో కలిసి సిసి రోడ్ల నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఆశీస్సులతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో వంద కోట్ల నిధులతో యుజిడి పనులు చివరిదశకు చేరుకున్నాయని, అంతర్గత రోడ్లన్నీ ఇబ్బందికరంగా మారినందున పట్టణ ప్రజల అవసరాల దృష్ట్యా మున్సిపల్ పాలకవర్గం కృషి మేరకు సిఎం కెసిఆర్ ఆశీస్సులతో, జిల్లా మంత్రి సహకారంతో రూ.22 కోట్ల నిధులను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంత్రి సూచన మేరకు ఆమోదించిన పనులకు అవసరమగు టెండర్ ప్రక్రియను వెంటనే పూర్తిచేసి త్వరలో పనులు చేపట్టి పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పాలకవర్గం పూర్తిస్థాయిలో పనిచేయాలన్నారు. మంత్రి హరీశ్‌రావు రూ.22 కోట్లతో ప్రతిపాదించిన పనులకు పరిపాలన ఆమోద ప్రొసిడింగ్స్‌ను గడా అధికారి ముత్యంరెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మన్, పాలకవర్గానికి అందించారు. మున్సిపల్‌లో సిసి రోడ్లకు నిధుల మంజూరుకు సహకరించిన ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, గడా అధికారి ముత్యంరెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


మున్సిపల్ చైర్మన్ రాజమౌళికి ప్రొసిడింగ్ అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

## ఈ నెల 15న బాల, బాలిక వెయిట్ లిఫ్టింగ్
### సెలక్షన్‌ను సద్వినియోగం చేసుకోండి

**సదాశివపేట, నవంబర్ 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆదేశానుసారం సంగారెడ్డి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విఎంహెచ్ఎస్ విజ్ఞాన్ మాడల్ స్కూల్ గ్రౌండ్ సదాశివపేట బాల బాలిక వెయిట్‌లిఫ్టింగ్ సెలక్షన్ నిర్వహించబడును. ఆసక్తి గల వారు బోనఫైడ్‌తో కార్యదర్శి దశరథ్ సెల్ నంబర్ 9440504200ను సంప్రదించా లన్నారు. సెలక్షన్ అయిన బాలబాలికలు సిద్దిపేటలో జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ టౌర్నమెంట్‌లో పాల్గొంటారు. యు/17 బాలికల విభాగం వయసు గ్రూప్ కేటగిరి వారిగా 40కేజీలు, 45కేజీలు, 49కేజీలు, 55కేజీలు, 59కేజీలు, 64కేజీలు, 71కేజీ,76కేజీలు, 81కేజీలు, యు/17 బాలుర విభాగం కేటగిరి వారు 49కేజీలు, 55కేజీలు, 61కేజీ, 67కేజీలు, 73కేజీలు, 81కేజీలు, 89కే జీలు, 96కేజీలు, 102కేజీలు, 102కేజీలు ఈ విభాగాలలో వెయిట్ లిఫ్టింగ్ సెలక్షన్ నిర్వహించబడునన్నారు. సెలక్షన్ అయిన బాల బాలికలు సంగారెడ్డి జిల్లా తరపున పాల్గొంటారన్నారు.



ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి శ్రేణులు

## రైతుల పక్షాన మోడీకి స్వాగతం

**రామాయంపేట, నవంబర్ 11, ప్రభాతవార్త :** పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఎరువుల కర్మాగారం ప్రారంభోత్సవం, జాతికి అంకితం చేయనున్న ప్రధాని నరేంద్రమోడీకి రైతుల పక్షాన స్వాగతంతో పాటు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బిజెపి నాయకులు తెలిపారు. శుక్రవారం ఉదయం మోడీ చిత్రపటానికి రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వేయి ఎకరాల విస్తీర్ణంలో 6,338 కోట్ల రూపాయలతో రామగుండం ఎరువుల కర్మాగారంను ప్రారంభోత్సవంతో జాతికి అంకితం చేయనున్నారన్నారు. అంతేకాకుండా తెలంగాణలో రూ. 9,500 కోట్లతో అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేయనున్నారని వివరించారు. యూరియా, అమోనియం, పాస్పేట్ వంటి వ్యవసాయ ఎరువులను రైతులకు సబ్సిడీతో ఇవ్వటం, రైతుల ఆర్థికప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రైతులకు మేలు చేసే ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, 2వ వార్డు కౌన్సిలర్ సుందర్‌సింగ్, పట్టణ ప్రధాన కార్యదర్శి నరేందర్‌చారి, ఓబిసి మోర్చా అధ్యక్షుడు కటికె కార్తిక్, మైనారిటి మోర్చా అధ్యక్షుడు ఎండి. జహీర్, ఎస్‌టి మోర్చా అధ్యక్షుడు భాస్కర్ నాయక్‌లతోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## రైతులు నష్టపోకూడదనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు మహేష్‌గుప్త

**శివ్వంపేట, నవంబర్ 11 ప్రభాతవార్త:** రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో సిఎం కేసీఆర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని జెడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్త, ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మగ్దుంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు లావణ్యమాధవరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాయిని వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్‌గుప్త మాట్లాడుతూ గిట్టుబాటు ధరను కల్పించి గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న ఘనత దేశంలోనే సీఎం కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. ఎంపీపీ హరికృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోడీ తెలంగాణ వడ్లను కొనుగోలు చేయమని చెప్పినప్పటికీ రైతులు ఆగం కావొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మగ్దుంపూర్ సర్పంచి సోము అశోక్, శివ్వంపేట సర్పంచి శ్రీనివాస్‌గౌడ్, మండల కోఆప్షన్ సభ్యులు లాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ పెంటాగౌడ్, సీఈవో మధు యాదవ్, దంతాన్‌పల్లి ఉప సర్పంచి నాగేశ్వరరావు, కత్తి శ్రీనివాస్, కత్తి గిరిబాబు, డీలర్ జగన్‌రెడ్డి, పోచాగౌడ్, జ్యోతి, సింహం తదితరులు పాల్గొన్నారు.

## బర్ధీపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**టేక్మాల్,నవంబరు 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బర్ధీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పిఏసియస్ డైరెక్టర్ శ్రీశైలం మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. అందులో భాగంగానే రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకుగాను కొనుగొల కేంద్రాలు ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయసుధవిష్ణువర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోపి, ఆదర్శరైతు గోపాల్‌రెడ్డి, విష్ణు, రంజిత్‌రెడ్డి, మాణయ్య, అంజయ్య, దుర్గేష్, మల్లేశం, సత్యంలు తదితరులున్నారు.

## ఏబీఆర్ఎస్ఎమ్ 8వ జాతీయ మహాసభలకు హాజరైన తపస్ నాయకులు



ఏబీఆర్ఎస్ఎమ్ జాతీయ మహాసభలకు హాజరైన తపస్ నాయకులు

**మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 11 ప్రభాతవార్త:** బెంగళూర్‌లో జరుగుతున్న అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎమ్) 8వ జాతీయ మహాసభలకు తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, మెదక్ జిల్లా అధ్యక్షులు జిడ్డి ఎల్లం, ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్‌లు హాజరయ్యారు. ఈ సమావేశాలు ఈ నెల 11, 12, 13వ తేదీలలో మూడు రోజుల పాటు జరుగుతాయని, ఇండియా టు భారత్ అను నినాదంతో నూతన జాతీయ విద్యా విధానం అమలు ఆవశ్యకత, సీపీఎస్ విధానం రద్దు, మాతృభాషలో బోధన వంటి అనేక విషయాలపై చర్చిస్తారని, ఈ సమావేశాలకు దేశంలోని 28 రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, దేశంలోని ప్రఖ్యాత విశ్వ విద్యాలయాల ప్రొఫెసర్లు కలిపి మూడు వేల మంది వరకు పాల్గొంటారని జెడ్డి ఎల్లం తెలిపారు.

## విద్యార్థినులకు షీ-టీంపై అవగాహన

**పాపన్నపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని కుర్తివాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెదక్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం షీ-టీంపై అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్, వ్యక్తుల అపహరణ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, అమ్మాయిలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ-టీం విభాగం ఎస్ఐ మల్లయ్య, సిబ్బంది గంగమణి, విజయ్, ఇసాక్, ఉపాధ్యాయులు భూలిబాయి, శ్యామ్, నాగభూషణం, నరేందర్, వెంకటేశం, మనోహర్, స్వరూప రాణి, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థినులకు షీ-టీంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# ఆడపిల్లల తల్లిదండ్రులకు వరం 'కళ్యాణలక్ష్మి'

**పాపన్నపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** ఆడపిల్లల తల్లిదండ్రులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం వరం లాంటిదని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకం అమలుకు ముందు బాల్య వివాహాలు జరిగేవని, పథకంలో లబ్దిపొందేందుకు 18 సంవత్సరాల వయసు ఉండాల్సి ఉండటంతో తల్లిదండ్రులు బాలిక వయసు 18 నిండాకే పెళ్లిళ్ల చేయడం మొదలయిందని ఆనందం వ్యక్తం చేశారు. గిరిజనుల మూడ నమ్మకాలు కళ్యాణలక్ష్మి పథకం అమలుతో పటాపంచలయ్యాయన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం...**

పాపన్నపేటలో చెక్కుల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన స్థలం, సౌకర్యాల కల్పనపై ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రెవెన్యూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్కులు అందుకునేందుకు ఎంత మంది లబ్ధిదారులు వస్తారో తెలిసి కూడా సరైన స్థలం ఎంపిక చేయకపోవడంతో పాటు కార్యక్రమంలో అవసరమైనన్ని కుర్చీలు ఏర్పాటులో విఫలం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి తహసీల్దార్ గైర్హాజరు కావడం ఏమిటని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు కుమ్మరి జగన్, కుబేరుడు, మార్కెట్ కమిటి చైర్మన్ వెంకట్‌రెడ్డి, పాపన్నపేట సర్పంచ్ గురుమూర్తిగౌడ్, కో-ఆప్షన్ సభ్యులు గౌస్, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు వెంకట్‌రాములు, ప్రమీల, రాణి కిష్టయ్య, నవీన్, స్రవంతిశ్రీనివాస్, మల్లేశం, సంగప్ప, సంజీవరెడ్డి, అనురాధ ఏడుకొండలు, శ్రీకాంత్, లింగారెడ్డి, బాపురెడ్డి, ఎంపిటిసి సభ్యులు మోహన్‌రావు, సరస్వతి వెంకటేశం, నాయకులు దుర్గయ్య, ఎంపిడిఒ శ్రీనివాస్, ఆర్ఐ, లబ్దిదారులు పాల్గొన్నారు.

# అసత్య ఆరోపణలు చేయడం తగదు : జడ్పిటిసి

**వెల్దుర్తి, నవంబర్ 11 ప్రభాతవార్త:** నాపై అసత్య ఆరోపణలు చేయడం తగదని జెడ్పీటీసీ రమేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం వెల్దుర్తిలోని ఆయన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ గౌడ్ మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, నిజానిజాలు తెలుసుకొని ఆరోపణలు చేయాలని, అవాస్తవాలు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టడం సరి కాదన్నారు. కుకునూర్ వద్ద గుడి బండపై క్రషర్ ఏర్పాటులో జెడ్పీటీసీకి సంబంధం ఉందని నర్సాపూర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి గోపి ఆరోపించడం సరికాదన్నారు. కుకునూర్‌లో ఉన్న బండను నా చిన్నతనం నుండి చూస్తున్నానని, గ్రామస్థులకు అంతా తెలుసుని, బండపై ఏ గుళ్లు ఉన్నాయో గ్రామ పెద్దలందరికీ తెలుసన్నారు. బండపై క్రషర్ ఏర్పాటు చేస్తున్నారని తెలుసుకొని బండపై గుడి ఏర్పాటు చేస్తామని చెప్పి మత రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. మండలంలో బీజేపీ క్యాడర్ లేదని, నలుగురిని వెంటేసుకొని పార్టీ బలోపేతం కోసం దేవుళ్ల పేరు చెప్పి మత రాజకీయాలు చేయడం సరికాదన్నారు. బండపై క్రషర్‌కోసం గ్రామ సభలు నిర్వహించి అనుమతులు ఇవ్వడం జరిగిందని, అప్పుడు తాను అడ్డుకున్నానని, అలాంటిది నన్ను ఇప్పుడు డబ్బులు తీసుకున్నాననడం సరికాదని, నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. టీపీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి మాసాయిపేట ప్రక్కనే క్రషర్లు నడుస్తున్నాయని, అక్కడ ఏమి చేయలేక వెల్దుర్తిలో ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గ్రామ సభలు నిర్వహించి క్రషర్ ఏర్పాటుకు ఎన్‌వోసీ గతంలోనే మంజూరు చేశారని, తమపై లేనిపోని నిందలు మోపడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు మహేదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమేష్‌గౌడ్



గవ్వలపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాలమణి

## తూకం పేరిట మోసం చేస్తున్న నిర్వాహకులు

### సిఐటియు కార్యవర్గ సభ్యురాలు బాలమణి

**మెదక్, నవంబర్ 11, ప్రభాతవార్త:** తూకం పేరిట కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మోసం చేస్తున్నారని సిఐటియు కార్యవర్గ సభ్యురాలు బాలమణి ఆరోపించారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని గవ్వలపల్లి, వెంకట్‌రావుపల్లి గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక బస్తా 40 కిలోల 600 గ్రాములు మాత్రమే ధాన్యం తూకం వేయాలని, కానీ జల్లెడ పట్టిన ధాన్యానికి కూడ బస్తాకు 42,43 కిలోలు తూకం వేస్తున్నారని అన్నారు. 43 కిలోలు తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించడానికి లారీలను దొరికినప్పుడు 42 కిలోల తూకం చేసిన ధాన్యానికి లారీల కొరత ఎందుకు ఏర్పడుతుందని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టకపోతే జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో రైతులతో ధర్నాలు, రస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆమె వెంట సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేషంలు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

### మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్

**నర్సాపూర్, నవంబర్ 11, ప్రభాతవార్త:** ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మురళీయాదవ్ సందర్శించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మురళీయాదవ్ మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. దీంతో రైతులు కొనుగోలుకేంద్రాలవద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం బస్తాలను తీసుకెళ్లడానికి లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద బస్తాలు కుప్పలుకుప్పలుగా పడి ఉన్నాయన్నారు. దీంతో రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతుందని చెప్పారు. వెంటనే అధికారుల స్పందించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

## మోడీ పర్యటనను అడ్డుకుంటాననడం సిగ్గుచేటు

**నర్సాపూర్, నవంబర్ 11, ప్రభాతవార్త:** సిఎం కెసిఆర్ ప్రధాని నరేంద్ర మోడి పర్యటనను అడ్డుకుంటామనడం సిగ్గుచేటని బిజెపి నాయకులు విమర్శించారు. శుక్రవారం నర్సాపూర్‌లోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నర్సాపూర్ తాలూకా ఇంచార్జీ సింగాయిపల్లి గోపి, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ రామగుండం ఎరువుల కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్రమోడీని అడ్డుకోవాలని సిఎం కెసిఆర్ పిలుపునివ్వడం చేటన్నారు. అభివృద్ధికి సహకరించాల్సిన ముఖ్యమంత్రి అడ్డుకోవాలనుకోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు ప్రధాన మంత్రి పర్యటను అడ్డుకోవాలనిచూస్తే టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను, కార్యకర్తలును అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు నర్సింగరావునాయక్, కౌన్సిలర్లు గోడ రాజేందర్, సంగసాని సురేశ్,నాయకుల బాల్‌రెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు దిగంబర్, అధికార ప్రతినిధి కొత్త శ్రీనివాస్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్‌తోనే గజ్వేల్ అభివృద్ధి

### -ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజకవర్గం సిఎం కెసిఆర్ తోనే అభివృద్ధి సాధ్యమైందని ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అంతర్గత సిసి రోడ్ల కోసం సిఎం కెసిఆర్ 22.87 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీని అన్ని రంగాలలో సకల హంగులతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. గత మూడు సంవత్సరాల నుండి వంద కోట్ల వ్యయంతో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని గుర్తుచేశారు. అండర్ డ్రైనేజీ నిర్మాణం పూర్తయిన వెంటనే పలు వార్డుల్లో సిసి రోడ్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సిఎం కెసిఆర్ పాలనలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి జరిగిందన్నారు. మంత్రి హరీశ్‌రావు సహకారంతో గజ్వేల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని మున్సిపాలిటీకి నిధులు విడుదల చేసినందుకు సిఎం కెసిఆర్‌కు, మంత్రి హరీశ్‌రావు, కెటిఆర్‌లకు మున్సిపాలిటీ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రేపు చిన్నకోడూరు మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారం

**చిన్నకోడూరు, నవంబర్ 11, ప్రభాతవార్త :** చిన్నకోడూరు మండల మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 13న చంద్లాపూర్ రంగనాయకసాగర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కామిని శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజాశర్మ, ఎంపిపి కూర మాణిక్యరెడ్డి, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సకాలంలో హాజరు కావాలన్నారు.

# రైతులకు న్యాయం జరిగేవరకు సర్వేను సాగనివ్వం

**టిపిసిసి అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్**

**నర్సాపూర్, నవంబర్ 11, ప్రభాతవార్త:** రెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నుంచి వెళుతున్న రీజినల్ రింగ్‌రోడ్డు సర్వేను రెడ్డిపల్లి గ్రామస్తులతో పాటు టిపిసిసి అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్ అడ్డుకున్నారు. శుక్రవారం రెడ్డిపల్లి గ్రామంలో నుండి ట్రిబుల్ ఆర్ రోడ్డుకు సర్వే చేయడానికి అధికారుల వచ్చారు. దీంతో న్యాయం చేసే వరకు సర్వేను చేయనియ్యమని వారు అడ్డుకోవడంతో సర్వే చెయ్యడం నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం బడా నాయకులకు మేలు జరిగేలా రింగ్‌రోడ్డు సర్వేను మార్చారన్నారు. రెడ్డిపల్లి గ్రామం నుండి మొదట కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద భూములు కోల్పొగా, కరెంటు హైటెన్షన్ వైర్లకు భూములు కోల్పొగా కొండపోచమ్మ కాలువ నిర్మాణానికి రైతులు చాల భూములు కోల్పోయారని తెలిపారు. కాగా ప్రస్తుతం రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ఇంతకు ముందు రెడ్డిపల్లి నుండి పెద్దచింతకుంట మీదుగా సర్వే చేశారని, ప్రస్తుతం రెడ్డిపల్లి గ్రామం మధ్యలో నుంచి వెల్లుండగా రైతులు చాలా భూములు కోల్పోవాల్సి వస్తుందని చెప్పారు. త్రిబుల్‌ఆర్ రోడ్డు కోసం మొదటగా అధికారుల భూసేకరణ అలైన్‌మెంట్ ప్రతిపాదించారని కొంత మంది నాయకులు భూములు కాపాడేందుకు అలైన్ మెంట్‌ను మార్చారని కొత్తగా మార్చడం వల్ల రెడ్డిపల్లి గ్రామం చెరువు సగం పోతుండగా చాల మంది రైతుల భూములు కోల్పొతున్నారని మండిపడ్డారు. అధికారుల ప్రజాక్షేత్రంలో రైతుల అంగీకారంతో గ్రామ పంచాయతీ తీర్మానం తీసుకొని రోడ్డు సర్వే చేయాలని ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, రెడ్డిపల్లి గ్రామ ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్, మాజీ సర్పంచ్ భరత్‌గౌడ్, నాయకుల మాణిక్యంగౌడ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



రీజినల్ రింగ్ రోడ్డు సర్వే చేస్తున్న అధికారులను అడ్డుకున్న ఆంజనేయులుగౌడ్ రైతులు తదితరులు



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

## ఉపాధి హామీ పనులను గుర్తించడానికి గ్రామసభలు

### -పంచాయతీ కార్యదర్శి రాజేందర్

**కొల్చారం, నవంబర్ 11 ప్రభాతవార్త:** 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులను గుర్తించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజేందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాయినిజలాల్‌పూర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఉపాధి హామీలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులను గుర్తించడానికి సర్పంచి కర్రె లచ్చయ్య ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. సభలో ఉపాధి హామీలో చేపట్టే నాలుగు రకాల పనులను గుర్తించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ ఉపాధి హామీలో కూలీలకు పనులు గుర్తించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, కర్రె సంజీవులు, పెంటప్ప, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## మౌలానా అజాద్‌కు ఘన నివాళులు




మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్

**నర్సాపూర్, నవంబర్ 11, ప్రభాతవార్త:** విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో మాజీ విద్యాశాఖ మంత్రి మహ్మద్ మౌలానా ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మురళీయాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ల కు దూరంగా ఉండి క్రమశిక్షణ, పట్టుదలతో మంచిగా చదువుకోవాలన్నారు. అంతకుముందు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్, కౌన్సిలర్లు గోడ రాజేందర్, సురేశ్, ప్రిన్సిపాల్ సంగమేశ్వర్, న్యాయవాది జాఫర్‌అలీ, నాయకులు కొత్త శ్రీనివాస్‌గుప్త, సురేగౌడ్, పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**వెల్దుర్తి, నవంబర్ 11 ప్రభాతవార్త:** మాసాయిపేట మండల పరిధిలోని రామాంతాపూర్ తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోగ్రామ్ ఎక్స్‌క్యూటివ్ శ్రీనివాస్, జీఎంఆర్ పోచంపల్లి హైవే సిబ్బంది నాగేశ్వరరావు, నారాయణరావులు వర్క్ బుక్స్, పుస్తకాలను పంపిణీ చేశారు. శుక్రవారం రామాంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 1-5 తరగతి విద్యార్థులకు రూ. 6 వేల విలువైన వర్క్ బుక్స్‌ను పంపిణీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకను వెలికి తీయడానికి ఈ పుస్తకాలు ఎంతో దోహద పడతాయని వారు అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నవీన్ కుమార్, ఉపాధ్యాయులు ఉదయశ్రీ, శాంతిలు జీఎంఆర్ఎస్ సంస్థ వారిని అభినందించారు.

## బాధితులకు నష్టపరిహారం అందజేసిన ఎమ్మెల్యే

**మెదక్, నవంబర్11 ప్రభాతవార్త:** వరద బాధితులకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి 1 లక్ష 15 వేల రూపాయల నష్టపరిహారం అందజేశారు. శుక్రవారం హవేళిఘనపూర్ మండలం వాడి, దూప్‌సింగ్ తండా, కప్రరాయిపల్లి గ్రామాలకు చెందిన భారీ వర్షాలకు జంతువులు కొట్టుకుపోయిన బాధిత కుటుంబాలకు, రైతులకు నష్టపరిహారం చెక్కులు అందజేశారు. అనంతరం రాజపేట గ్రామ శివారులో ఇండియన్ గ్యాస్ గోదాంను ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెదక్ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, ఇంచార్జి తహశీల్దార్ నవీన్ కుమార్, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి మాణిక్యరెడ్డి, ఎంపీటీసీ జ్యోతి సిద్ధిరెడ్డి, సర్పంచులు సరిత సాయాగౌడ్, రాజేందర్‌రెడ్డి, యామిరెడ్డి, కిషన్ నాయక్, సంధ్యారాణి సాయిలు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు జైపాల్‌గౌడ్, బాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు టీకాల పంపిణీ

**మెదక్, నవంబర్ 11, ప్రభాతవార్త:** పశువులకు లంపి వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి గీతామాలిక సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. లంపి వ్యాధి దోమలు, పిడుదులు ఈగల ద్వారా వ్యాప్తి చెందుతుందని, వ్యాధి సోకిన పశువుల్లో రోగ నిరోధక శక్తి తగ్గిపోయి బలహీన పడుతాయని, చర్మంపై మచ్చలు ఏర్పడి తీవ్ర జ్వరం వస్తుందన్నారు. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో పర్యవేక్షించి పశువులకు లంపి వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివకుమార్, పశు వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, రాజు, కార్తీక్, సుధాకర్, రేణుకలు పాల్గొన్నారు.

## దరఖాస్తులకు గడువు పొడిగింపు

**మెదక్, నవంబర్ 11, ప్రభాతవార్త:** దూరవిద్యలో పది, ఇంటర్ చదవాలనే విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని చిన్నశంకరంపేట ఓపెన్ స్కూల్ కన్వీనర్ విశ్వనాథచారి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చదువుపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లను ప్రభుత్వం ఈ నెల 21వ తేది వరకు పొడిగించిందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇదే చివరి అవకాశం అని, ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## సైంటిస్ట్ కిష్టయ్య భౌతికకాయనికి ఎమ్మెల్యే నివాళి

**టేక్మాల్,నవంబరు 11, ప్రభాతవార్త:** ఇస్రోసైంటిస్ట్ బోయిని కిష్టయ్య (42) పాముకాటుతో మృతి చెందిన సంఘటన తెల్సిందే స్వగ్రామమైన టేక్మాల్‌లో ఆయన మృతదేహానికి అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ నివాళులర్పించారు. ఆయన కుటుంబికులను పరామర్శించారు ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు వీరప్ప, టేక్మాల్ సర్పంచ్ సుప్రజ భాస్కర్, నాయకులు సిద్దయ్య, గొపాల్, శేకర్‌రెడ్డి, సర్దార్, కిషన్,శ్రీధర్‌రెడ్డి, రాములు, సాయిలు, సత్యం సలీంలున్నారు.



ఇస్రో సైంటిస్ట్ కిష్టయ్య భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

## చెట్టును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

**నిజాంపేట, నవంబర్ 11, ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టి యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన నిజాంపేట మండలం నందిగామ గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... చేగుంట మండలం కన్యారం గ్రామానికి చెందిన నల్ల సందీప్ (28)గా గుర్తించారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు నిజాంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న బిజెపి నాయకులు

## మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం

### బిజెపి మండల అధ్యక్షుడు వెంకటేశం

**కోహెడ, నవంబర్ 11, ప్రభాతవార్త :** ఎరువుల రసాయన కర్మాగారాన్ని జాతికి అంకితం చేయడానికి ప్రధానమంత్రి మోడీ వస్తుంటే అడ్డుకుంటాని టిఆర్ఎస్, సీపీఐ, సీపీఎంలు అనుచిత వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటని బిజెపి మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందన్నారు. రైతుల మేలు కోసం పని చేసే పార్టీని విమర్శించే పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈనెల 12న రామగుండంలో రూ.6300 కోట్లతో ఏర్పాటు చేసిన ఎరువుల రసాయన కర్మాగారాన్ని ప్రధాన మంత్రి మోడీ ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే రూ. వెయ్యి కోట్లతో భద్రాచలం వయా సత్తుపల్లి జాతీయ రోడ్డును జాతికి అంకితం ఇస్తారని తెలిపారు. ఎల్కతుర్తి వయా సిద్దిపేట మీదుగా బాసర వరకు 2200 కోట్లతో నిర్మించే జాతీయ రహదారికి శంకుస్థాపన చేసే కార్యక్రమాల్లో ప్రధాన మంత్రి పాల్గొంటారని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.సమావేశంలో పార్టీ శ్రేణులు చంద్రశేఖర్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్, తిరుపతి, జగన్‌యాదవ్, వెంకటేష్, సతీష్, రాంచంద్రారెడ్డి, రాజేందర్, రమేష్, ప్రభాకర్‌రెడ్డి, రాజు, సతీష్, సాగర్, ప్రకాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పర్యటనకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

**సిద్దిపేట రూరల్, నవంబర్ 11, ప్రభాతవార్త :** రామగుండం అర్ఎఫ్ సీఎల్ ఫ్యాక్టరీని మరల ప్రారంభించడానికి వస్తున్న ప్రధాని మోడీ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ఏ మొహం పెట్టుకొని రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న మోడీని అడుగుపెట్టనివ్వమని.. మోడీ గో బ్యాక్ అంటూ మండిపడ్డారు. విభజన చట్టంలో పొందుపరిచిన కాజీపేట రైల్వే కోచ్, గిరిజన విశ్వవిద్యాలయం, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయకుండా ప్రజలను మోడీ మోసం చేస్తున్నారని తెలిపారు. మధ్యతరగతి కుటుంబాలతో మోడీ చెలగాటం ఆడుతున్నారని పేర్కొన్నారు. మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా సీపీఐ, వామపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు.

## టిఆర్ఎస్ గూటికి అరిగె కృష్ణ


అరిగె కృష్ణకు కండువాకప్పి పార్టీలోకిఆహ్వానిస్తున్న మంత్రి హరీష్‌రావు

**దుబ్బాక, నవంబర్ 11, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రధాన అనుచరుడు, బొప్పపూర్ గ్రామనికి చెందిన అరిగె కృష్ణ బిజెపి మండల అధ్యక్ష పదవికి రాజీనామ చేసి శుక్రవారం మంత్రి హరీష్‌రావు నివాసంలో ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టిఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. ఈ సందర్భంగా అరిగె కృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘునందన్‌రావు గెలిచి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నియోజకవర్గ అభివృద్ధికి ఏ ఒక్క పని చేయక పోవడంతోనే బిజెపికి రాజీనామ చేసి టిఆర్ఎస్ పార్టీలో చెరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బొప్పాపూర్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కమలాకర్‌రావు, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జీడిపల్లి రవి, ఎనగుర్తి మాజీ సర్పంచ్ లింబాద్రి గౌడ్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్త కిషన్ రెడ్డి, పల్లె రామస్వామి గౌడ్, పర్స బాల్‌లింగం, ముక్క వెంకటపతి, వెంకట స్వామి, చలపతి, ఉన్నారు.

## మోడీ పర్యటనను వ్యతిరేకిద్దాం : అఖిలపక్షం నాయకులు



అఖిలపక్ష సమావేశం నిర్వహించిన దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, నవంబర్ 11, ప్రభాతవార్త:** ఈనెల 12న రాష్ట్రం లో మోడి పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఐ, కాంగ్రెస్, టిఆర్ఎస్, టిడిపి నాయకులు అఖిలపక్షం సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఒకవైపు దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యప్రజలు ఇబ్బందులు పడుతుంటే మోడీ మాత్రం కార్పొరేట్ పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్నాడని అఖిలపక్షం నాయకులు మండిపడ్డారు. దేశంలో రాజ్యాంగబద్ధమైన పాలన సాగడం లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నాయకులు రాష్ట్రాలలో ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడ్డ ప్రభుత్వాలను కూల్చే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర విభజన హామీలను బిజెపి ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. మోడీ పాలనలో దేశ ప్రజలు విసుగెత్తిపోయారని తెలిపారు. మోడీ పర్యటనను నిరసిస్తూ ఈనెల 12న హుస్నాబాద్‌లో బిజెపి మినహా మిగతా అన్ని పార్టీల అధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు.

## పిఆర్‌టియు సమావేశాన్ని విజయవంతం చేయాలి

### -సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

**మర్కుక్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం నుండి రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఓంకార్ రాధాకృష్ణ, శ్రీనివాస్‌రావు, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్ చారిలను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార్‌లు మాట్లాడుతూ ఈనెల 20న గజ్వేల్‌లో నిర్వహించే పిఆర్‌టియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి మండలం నుండి ఉపాధ్యాయులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్‌టియు సంఘం ఎంతగానో కృషి చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి, చేబర్తి కాంప్లెక్స్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రావు, ఎన్.లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబొద్దీన్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌చారి, సీనియర్ నాయకులు రమణారావు, శ్రీధర్, దిలీప్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రవి, బిక్షపతి, రాజేందర్, హారిక, చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పిఆర్‌టియు నాయకులు

# పిల్లలకు సరైన పోషకాలు అందేలా చూడాలి

### జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటీ రోజాశర్మ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి సరైన పోషకాలు అందేలా చూడాలని జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్త్రీ. శిశు సంక్షేమం, సాంఘీక సంక్షేమము, ఆర్థిక ప్రణాళిక స్థాయి సంఘం సమావేశాలలో అమె పాల్గొని మాట్లాడారు. పిల్లలు ఎవరూ పోషకాహార లోపంతో బాధపడకుడదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులకు సూచించారు.సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో పిల్లలకు భోజన సదుపాయం సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. కొన్నిచోట్ల పురుగులు పడ్డ భోజనం తిని విద్యార్థులు అస్వస్థకు గురవుతున్నారని అలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున వార్డెన్లు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్దపెట్టాలన్నారు. దళితబంధు లబ్దిదారులకు మంజూరైన యూనిట్లను లబ్దిదారులు సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ ఇంజనీరింగ్‌విభాగాలలో పెండింగ్ లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశాలల్లో జడ్పీటిసిలు రణం జ్యోతి, లింగయిపల్లి యాదగిరి, సిలివేరు సిద్దప్ప, కుంభాల లక్ష్మీ, సుధాకర్‌రెడ్డి, కడతల రవీందర్‌రెడ్డి, సీఈఓ రమేష్, డిప్యూటీ సీఈఓ సుమతి, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ స్థాయి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వేలేటీ రోజాశర్మ


మాట్లాడుతున్న బిజెపి నాయకులు శ్రీరాం

## ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించిన ఘనత బిజెపిదే

**హుస్నాబాద్, నవంబర్ 11, ప్రభాతవార్త :** వేల కోట్లతో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించిన ఘనత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికే దక్కుతుందన్న అక్కసుతో కాంగ్రెస్, టిఆర్ఎస్, సీపీఐలు మోడీ గో బ్యాక్ అంటూ విమర్శలు చేస్తున్నాయని ఆ పార్టీ నేత బొమ్మ శ్రీరామ్ ఆరోపించారు. హుస్నాబాద్ బిజెపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ఉత్పత్తిలో 50 శాతం ఎరువుల ఉత్పత్తి తెలంగాణ రాష్ట్రానికే చెందుతుందని..టిఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ పార్టీ నాయకులకు సంతోషంగా ఉందో లేదో చెప్పాలన్నారు. ఎరువుల ఫ్యాక్టరీవల్ల రైతులకు కలిగే నష్టమేంటో ముందు తెలియజేసిన తర్వాతే ప్రధాని మోడీపై విమర్శలు చేయాలని హితవు పలికారు. అఖిలపక్ష పార్టీల నాయకులు నిజంగా రైతు బిడ్డలైతే విమర్శలు మానుకోవాలన్నారు. మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ అధికారంలో ఉన్నంతకాలం ఏదైనా ప్రాజెక్టు తీసుకువచ్చారని ప్రశ్నించారు. మెదక్, సిద్దిపేట, హుస్నాబాద్, ఎల్కతుర్తి వరకు బిజెపి ఎంపి, పార్టీ అధ్యక్షులు బండి సంజయ్ కృషి ఫలితంగా దాదాపు 650 కోట్లతో పనులను ఈనెల 12న ప్రధాని మోడీ శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. బిజెపి అధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి మోడీ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. హుస్నాబాద్ ప్రాంతం నాలుగు లైన్ల జాతీయ రహదారితో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పేదలకు వరం..సిఎం సహాయ నిధి

**మిరుదొడ్డి, నవంబర్ 11, ప్రభాతవార్త:** పేదలకు సిఎం సహాయనిధి వరంగా మారిందని మెదక్ ఎంపి, జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డిలు అన్నారు.తొగుట మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లికి చెందిన వెంకట్‌రెడ్డికి రూ.2 లక్షల సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును, మిరుదొడ్డి మండలంలోని అల్వాల్‌కు చెందిన మునిగొల్ల మహేష్‌కు రూ. 2 లక్షల ఎల్ఓసీని ఎంపి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ నమిలే భాస్కరాచారి, ఎంపిపి గజ్జల సాయిలు,తొగుట మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు ఎం.డి. కలిమొద్దీన్, లింగుపల్లి సర్పంచ్ బాలనర్సింలు పాల్గొన్నారు.

## పాములపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**మర్కుక్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని శుక్రవారం ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, వైస్‌ఎంపిపి బాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతుధర పొందాలన్నారు. సిఎం కెసిఆర్ రైతుల ఆర్థికాభివృద్ధియే లక్ష్యంగా పనిచేస్తున్నారని గుర్తుచేశారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలకొక్కుల రాములు, మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి, ఏఈఓ రజినికాంత్, పిఏసిఎస్ సిఈఓ జితేందర్‌రెడ్డి, మండల టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు చిలివేరి కృష్ణగౌడ్, టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్ల మహేష్, టిఆర్ఎస్ నాయకులు పిట్ల సత్యనారాయణముదిరాజ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఉప్పరి నర్సింగరావు, మండల వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గుప్త, వార్డు సభ్యులు గణేష్, బేతి మధుసూదన్‌రెడ్డి, నాయకులు బోయిని మల్లేశ్, చెక్కల రాములు, జుట్టు సుధాకర్, తలకొక్కుల ప్రభాకర్, మేకల శ్రీనివాస్, పెద్దబోయిని కనకయ్య, శ్రీగిరిపల్లి కృష్ణ, వల్లకాటి పాండు, బాలస్వామి, సిలివేరు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి


గజ్వేల్‌లో నిరసన తెలుపుతున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

## గంగుల కమలాకర్‌పై ఈడి దాడులు ఆపాలి

### మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిరసన

**గజ్వేల్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** మంత్రి గంగుల కమలాకర్, ఎంపి రవిరాజు ఇళ్లపై ఈడి దాడులు ఆపాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులు పోరెడ్డి మల్లేశం, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షుడు చంద నర్సింలు అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం కోశాధికారి విష్ణుజగతి ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలో మున్నూరుకాపు సంఘం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ చౌరస్తా వద్ద మోడీ డౌన్ డౌన్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా రాజకీయ పరంగా ప్రజాసేవ చేస్తున్న మున్నూరుకాపుల్లో కొందరు నాయకులు ఎదుగుతున్నారని, వారిని చూసి కొందరు ఓర్వలేక ఈడి దాడులు అంటూ భయాం దోళనకు గురిచేస్తున్నారన్నారు. మున్నూరుకాపులు సంఘటితమై అలాంటి వ్యతిరేక శక్తులను ప్రజల్లో నిలువనీయకుండా చేస్తామని హెచ్చరించారు. మంత్రి గంగుల కమలాకర్ ప్రజా సంక్షేమం కోసమే ఎల్లవేళలా పనిచేస్తారని, ప్రజల కోసం పనిచేసే గొప్ప నాయకుల్లో గంగుల కమలాకర్ ఒకరన్నారు. ఎలాంటి నిరాధారంగా దాడులకు పాల్పడినా, అవమానపరిచినా మున్నూరుకాపులంతా ఐక్యంగా ఉద్యమిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ యువజన నాయకుడు మామిడి కృష్ణ, ఎండిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజ్వేల్ శేఖర్, ఆకుల చంద్రం, గంగిశెట్టి నర్సింలు, ఆకుల మల్లేశం, ఐల మహేందర్, వెంకటేష్, తూం మల్లన్న, జంగపల్లి నర్సింలు, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధిని వినియోగించుకోవాలి

### కౌన్సిలర్ నందాల శ్రీజాశ్రీకాంత్

**దుబ్బాక, నవంబర్ 11, ప్రభాతవార్త:** ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరు సీఎం సహాయ నిధిని వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని 11వ వార్డు కౌన్సిలర్ నందాల శ్రీజాశ్రీకాంత్ అన్నారు. మంత్రి హరీష్ రావు, సిద్దిపేట జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి సహాయ సహకారాలతో దుబ్బాక మున్సిపల్ లచ్చపేట 11వ వార్డులోని ఇటీవలే అనారోగ్యానికి గురై మెరుగైన చికిత్స పొందిన డి. రాములుకు రూ.15 వేల ఐదువందలు, పి.మల్లికార్జున్‌కి రూ. 16 వేల ఐదువందలు, టి. రమేష్‌కు రూ. 55 వేలు, ఎం.పవన్‌కళ్యాణ్‌కి 16 వేలు, మొత్తం 1 లక్ష 29 వేల చెక్కులను శుక్రవారం బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాతే ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి సిఎం సహాయ నిధి అందుతుందన్నారు. సీఎం సహాయ నిధిని ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరు వినియోగించుకోవలన్నారు. తెలంగాణ సర్కార్ ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను రూపొందించింది అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## అభ్యంతరాలపై వెంచర్‌ను సందర్శించిన డిపిఓ

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 11, ప్రభాతవార్త:** సంగారెడ్డి మండలం కుల్పగూర్ గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న వెంచర్‌ను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ సందర్శించారు. ఎస్ఎస్ఎం డెవలపర్స్ పేరుతో చేపట్టిన వెంచర్‌పై గత జిల్లా పరిషత్ సమావేశంలో లేవనెత్తిన అభ్యంతరాలను పురస్కరించుకొని వెంచర్‌ను అధికారులు పరిశీలించారని జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మెహమ్మద్ ముస్తాఫా తెలిపారు. ఈ సందర్భంగా డిపిఓ దృష్టికి తమఅభ్యంతరాలను మరోసారి వివరిస్తూ ప్రభుత్వ స్థలాన్ని కలుపుకొని వెంచర్ ఏర్పాటుచేస్తున్నారని, పదిశాతం స్థలాన్ని గ్రామ పంచాయతీకి స్వాధీనం చేయలేదని, బెటర్‌మెంట్ ఛార్జీలు చెల్లించలేదని, బఫర్‌జోన్‌లో రోడ్లు వేస్తున్నారని డిపిఓ దృష్టికి తీసుకెళ్లారు. తమ అభ్యంతరాలపై పూర్తివిచారణ జరిపించాలని డిపిఓను సురేష్‌మోహన్‌ను కోరారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ ఏడి ద్వార సర్వే చేయించి భూమిహద్దులు నిర్ధారణ చేయడం జరుగుతుందని, తరువాతే సమస్య కొలిక్కివస్తుందన్నారు. భూమి కొలతలకు సర్వే ఏడికి, ఇరిగేషన్ అధికారులకు లేఖలు రాయనున్నట్లు డిపిఓ తెలిపారు. వెంచర్‌ను సందర్శించిన వారిలో ఏడి వినేష్, మండల సర్వేయర్ కోటేశ్వరరావు, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ముస్తాఫా, ఉపసర్పంచ్ తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**కొండపాక/చిన్నకోడూరు/తొగుట, నవంబర్ 11, ప్రభాతవార్త :**

రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ఉండానికే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సిరిసనగండ్లలో శుక్రవారం పిఏసిఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ఎంపిపి ర్యాగల సుగణ తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పంటకు మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడెపు లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల రమేష్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నూనె కుమార్, రైతు సమన్వయ సమితిమండల కో-ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిటిసి పద్మమల్లేశంగౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఓబులాపూర్‌లో మంత్రి హరీష్‌రావు, ఎంపిపి కూర మాణిక్యరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందన్నారు. ఏ గ్రేడ్‌కు రూ. 2060, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2040 ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఐలయ్య, గంగాపూర్ పిఏసిఎస్ చైర్మన్ ములకల కనకరాజు, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్, నాయకులు కొండం రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**తొగుటలో...**

మండల పరిధిలోని ఘణపూర్, వరదరాజుపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పిఏసిఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య ప్రారంభించారు. మంత్రి హరీష్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షులు బోధనం కనకయ్య, సర్పంచ్ కుంబాల వెంకటమ్మ, చత్రి రాజవ్వ, ఎంపిటిసి కొమ్ము శరత్, ఐకెపి ఎపిఎం ముగ్దమ్ అలీ, వార్డు సభ్యులు, మార్కెట్ డైరెక్టర్లు, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.


సిరిసనగండ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం


ఓగులాపూర్‌లో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న దృశ్యం

## చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

### డిఇవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి

**కొండపాక, నవంబర్ 11, ప్రభాతవార్త :** చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా సామాగ్రిని పంపిణీ చేసి క్రీడ గది, సైన్స్ ల్యాబ్, డిజిటల్ గ్రంథాలయ గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,క్రీడల్లో శారరీక ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కాగా గ్రామానికి చెందిన చిట్కుల నారాయణరెడ్డి, బొంతుల రాజిరెడ్డి రూ. 20 వేల విలువ చేసే క్రీడా సామాగ్రిని పాఠశాలకు అందించడంతో డిఈఓ వారిని అభినందించారు. జాతీయ విద్య దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. త్వరలో జాతీయస్థాయి యోగ పోటీలలో పాల్గొనపోతున్న విద్యార్థులు నాగలక్ష్మీ, వెన్నలను ప్రత్యేక ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి రామస్వామి, సర్పంచ్ రజితరాజిరెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు రఘువర్ధన్‌రెడ్డి,గీత, యూసుఫ్, రాజేందర్, మమత, రంగరావు, ఉస్మాన్, తోట సతీష్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ క్రీడాకారుడు శివకు సన్మానం


గోల్డ్ మెడల్ సాధించిన శివను సత్కరిస్తున్న మంజులరెడ్డి

**హుస్నాబాద్ రూరల్, నవంబర్ 11, ప్రభాతవార్త :** అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన సిరిగిరి శివ హుస్నాబాద్ నియోజకవర్గానికి మంచి గుర్తింపు తెచ్చారని సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులరెడ్డి అన్నారు. హుస్నాబాద్‌లోని మంజులక్క యువసేన కార్యాలయంలో గోల్డ్ మెడల్ సాధించిన సిరిగిరి శివను మంజులరెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అమె శుక్రవారం మాట్లాడుతూ శివ తల్లిదండ్రులు పేదవారైనప్పటికీ కిక్ బాక్సింగ్‌లో శివకు మంచి శిక్షణ ఇప్పించి అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించేలా కృషి చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇలాంటి పేద క్రీడాకారులను ఆదుకొని ఉపాధి కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో కిక్ బాక్సింగ్ క్రీడాకారుడు శివ పాల్గొనున్న కిక్‌బాక్సింగ్ టోర్నమెంట్లలో అన్ని విధాలుగా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.

## కళ్యాణోత్సవ, జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహిద్దాం

### జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, నవంబర్ 11, ప్రభాతవార్త :** శ్రీమల్లికార్జున స్వామి దేవస్థానంలో డిసెంబర్ 18న జరిగే కళ్యాణోత్సవం జాతర ఏర్పాట్లు చేయడానికి కో-ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేయాలని కొమురవెల్లి దేవాలయం పాలక మండలి చైర్మన్ గీస భిక్షపతి, ఈవో బాలాజీ, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్‌లు శుక్రవారం కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. స్వామివారి కళ్యాణోత్సవం, జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం త్వరలో నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుందామని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

## టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన సంపత్‌గుప్త


టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తతో సంపత్‌గుప్త

**గజ్వేల్, నవంబర్ 11 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యూత్ అధ్యక్షుడు, టిఆర్ఎస్ పార్టీ సహాయ కోశాధికారి ఉత్తునూరి సంపత్‌గుప్త శుక్రవారం తెలంగాణరాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ ఉత్తునూరి సంపత్ టిఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ సమాజసేవలో ముందుంటూ అందరి మన్ననలు పొందుతూ గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. టిఆర్ఎస్ పార్టీలో సంపత్‌కు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. ఉత్తునూరి సంపత్ మాట్లాడుతూ ఇటీవల లండన్ పర్యటన పూర్తిచేసుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా, మునుగోడు ఉప ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసి టిఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకు కృషి చేసిన సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తను కలిసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సారధి ఫౌండేషన్ చైర్మన్ గుడాల శేఖర్‌గుప్త, సాయి, శంకర్ పాల్గొన్నారు.

## విఠలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**చిన్నకోడూరు, నవంబర్ 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని విఠలాపూర్‌లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గంగాపూర్ పిఏసిఎస్ చైర్మన్ ములకల కనకరాజు, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కాముని ఉమేష్‌చంద్రలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దికుంట నవీన్ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి,ఉప సర్పంచ్, అల్లీపూర్ సొసైటీ డైరెక్టర్లు వార్డు సభ్యులు రామకృష్ణ, శ్రీను, లక్ష్మీ పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

**ములుగు, నవంబర్ 11 (ప్రభాతవార్త):** ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ములుగు మండలం బండతిమ్మాపూర్ గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...బండతిమ్మాపూర్ గ్రామానికి చెందిన మంగలి మహేష్(32) మేడ్చల్ జిల్లా కాళ్లకల్ గ్రామంలో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండేవాడు. బుధవారం ఉదయం 8 గంటలకు పనికి వెళ్ళి ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య నవ్య మహేష్‌కు ఫోన్‌చేయగా లేట్ అవుతుందని చెప్పాడని, తెల్లవారిన ఇంటికి రాకపోవడంతో గురువారం ఉదయం 6 గంటలకు మళ్ళీ ఫోన్ చేయగా మహేష్ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబసభ్యులు అతని కోసం వెతికారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కోనేరు చెరువు పక్కన అతని చెప్పులు ఉండడంతో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటాడని గజ ఈతగాళ్ళతో వెతికించగా మహేష్ శవం లభ్యమైంది. మృతుడు కాలకృత్యాలు తీర్చుకోవడానికి గ్రామంలోని చెరువువద్దకు వెళ్ళగా ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శివకుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



వంటకాలను పరిశీలిస్తున్న ఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

## కస్తూర్బాగాంధీ పాఠశాల తనిఖీ

**నారాయణఖేడ్, నవంబర్ 11 ప్రభాతవార్త:** విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైన సరే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ చౌరస్త వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని భోజన,వసతులు వంటలు ఏ విధంగా వండుతున్నారు, వాటిపై పరిశీలించారు. గత కొన్ని రోజులు క్రితం పాఠశాలలో కలుషిత ఆహారం తినడం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురైన సంగతి విధితమే. పాఠశాలలోని సిబ్బంది వంట వండే సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో ఎంతటివారైన సరే నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ తనయుడు రమేష్‌చౌహాన్, రవీందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం మహా సభ కరపత్రం ఆవిష్కరణ



జిల్లా మహా సభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి, నవంబరు 11, ప్రభాతవార్త:** నవంబరు 16న జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించే రైతు సంఘం సంగారెడ్డి జిల్లా 2వ మహాసభ కరపత్రాన్ని శుక్రవారం మండలంలోని శివపూటలో సంఘం బాధ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి పి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు స్వామినాథం కమీషన్ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధరలు ఇవ్వాలని ప్రభుత్వంకు డిమాండ్ చేశారు. రైతుల రుణమాఫీని వెంటనే ఏక కాలంలో మాఫీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ కంపెనీలకు ఊడిగలు చేయడంతోనే సరిపోతోందని, రైతులను పట్టంచుకున్న పాపాన పోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మహా సభలకు ముఖ్య అతిథిగా ఐకాస్ జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సాగర్‌లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డిలో నిర్వహించే మహా సభకు రైతులు పెద్ద సంఖ్యలో చేరుకోవాలని జైపాల్‌రెడ్డి వినతి చేశారు.

## విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

**-మండల విద్యాధికారి డి.అంజయ్య**



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఓ అంజయ్య

**సదాశివపేట, నవంబర్ 11, ప్రభాతవార్త:** పుల్కల్ మండలం, చౌటాకూర్ మండల్లాలోని పాఠశాలలను శుక్రవారం మండల విద్యాధికారి డి.అంజయ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి అంజయ్య మాట్లాడుతూ హన్మానాయక్ తండా విద్యార్థులు తెలుగు బాగా చదువుతున్నారన్నారు. విఠల్‌నాయక్ తండా విద్యార్థులు తెలుగులో మెరుగ్గా రాణించాలన్నారు. బొమ్మరెడ్డిగూడెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల హాజరు 100శాతం ఉండాలని 206మంది విద్యార్థులకు 168మంది మాత్రమె ఉన్నారన్నారు. పదవ తరగతి ప్రత్యేక తరగతులు నేటి నుండి తప్పనిసరిగా కొనసాగించాలని హస్టల్ వెల్ఫేర్ అధికారిని, ఉపాధ్యాయులకు ఆదేశించారు. విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు రోజు మాస్ డ్రిల్ చేయించాలన్నారు. విద్యార్థులకు మాస్ డ్రిల్ చేయించడం జరిగిందన్నారు. చౌటాకూర్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, శశిధర్, రాందాస్, సిఆర్‌పిలు మల్లేశం, ఆంజనేయులు పాల్గొన్నారు.

### పుల్కల్, చౌటకూరు మండలాల్లో..

**పుల్కల్, నవంబరు 11, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండలంలోని పుల్కల్, చౌటకూరు మండలాల్లోని ఆయా పాఠశాలలను శుక్రవారం మండల విద్యాధికారి అంజయ్య అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆయా పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. విఠల్‌నాయక్ తండా విద్యార్థులు తెలుగులో మెరుగ్గా రాణించాలని సూచించారు. బొమ్మరెడ్డి గూడెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం వంద శాతం ఉండేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ఎస్ఎస్‌సి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఈ నాటి నుంచే విధిగా నిర్వహించాలని ఉపాధ్యాయులను, వసతిగృహం బాధ్యులను ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మాస్ డ్రిల్ చేయించి నిత్యం డ్రిల్ చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## బాల బాలికలకు హక్కుల భద్రతపైన అవగాహన

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 11, ప్రభాతవార్త:** మెడ్వాన్ కార్యాలంలో మంజీరా రూలర్ డెవలప్ మెంట్ సొసైటిక్ యూనిసెఫ్ తెలంగాణ ఏలియన్స్ చైల్డ్ రెడ్స్ సహకారంతో సంగారెడ్డిలో బాల బాలికలకు హక్కుల భద్రతపైన అవగాహన కార్యక్రమం శుక్రవారం నాడు జరిగింది. మెడ్వాన్ ఆర్ డీఎస్ స్వచ్ఛంద సంస్థల అధినేత హెచ్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా బాలల భద్రత అధికారి సిడబ్ల్యూలు సిడిపిపివో రత్నం రాష్ట్ర ప్రభుత్వం బాలబాలికల హక్కులు, భద్రతకోసం చేపడుతున్న చర్యల గురించి వివరించారు. యంఆర్‌డీఎస్ సమస్త అధినేత హెచ్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ యునిసెఫ్ మహిళ సహకారంతో బాలల హక్కుల వారోత్స వాల్లో భాగంగా బాలల హక్కులు పరిక్షణ భద్రతాపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల విద్యార్థులు పాల్గొన్నారు. సంగారెడ్డి హత్నూర, కొండాపూర్, కంది జిల్లాల బాలల భద్రత విభాగం అధికారులు సిడబ్ల్యూలు సి వెంకటకేశం చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ ముజిబ్, చైలన్డలైన్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## హత్నూర ఏపీఎంగా దేవేందర్

**హత్నూర, నవంబర్ 11, ప్రభాతవార్త:** హత్నూర మండల సామాఖ్య ఏపీఎంగా దేవేందర్ నియమతులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయం సిబ్బంది శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఇప్పటివరకు హత్నూర ఏపీఎంగా పనిచేసిన శ్రీదేవి జిల్లా కేంద్రానికి బదిలి అయ్యారు.

# మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయకం

### పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**సంగారెడ్డి, నవంబర్ 11, ప్రభాతవార్త:** భారతరత్న డాక్టర్ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జీవితం నేతి తరానికి స్ఫూర్తిదాయకమని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ స్వతంత్ర భారతావని కోసం అలుపెరుగని పోరాటం చేయడంతో పాటు స్వాతంత్ర్య అనంతరం ఏర్పడిన మొట్టమెదటి మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలు మరవలేనివనీ అన్నారు. దేశంలో విద్యారంగానికి ఆయన చేసిన సేవలు గాను ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నారాయణఖేడ్‌లో..

**నారాయణఖేడ్, నవంబర్ 11 ప్రభాతవార్త:** మౌలానా అబుల్ కలామ్ అజాద్ అరబిక్, ఇంగ్లీష్, ఉర్దు, హిందీ, పెర్షియన్ , బెంగాలీ తదితర భాషల్లో



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

ఎంతో ప్రావీణ్యుడని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణ ఖేడ్ పట్టణంలోని మైనార్టీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో అబుల్ కలామ్ అజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం బాలుర,బాలికల గురుకుల పాఠశాలల్లో ఆట పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. ఖేడ్ మున్సిపాల్ ఛైర్మన్ రుబినా బేగం నజీబ్, మున్సిపల్ కౌన్సిలర్లు, విఠల్, నర్సింలు, నాయకులు రవీందర్‌నాయక్, నారాయణఖేడ్ పట్టణ తెరాస అధ్యక్షులు నగేష్, ప్రిన్సిపాళ్లు ఖాదర్, మంజూల పాల్గొన్నారు.

### జిన్నారంలో..



మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళులు అర్పిస్తున్న యువత దృశ్యం

**జిన్నారం, నవంబరు 11, ప్రభాతవార్త:** భారత దేశ ప్రథమ విద్యా శాఖ మంత్రి, భారత రత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్‌జయంతిని పురష్కరించుకుని శుక్రవారం బొల్లారం మున్సిపాలిటీ టిఆర్ఎస్ యువత నాయకులు ఘన నివాళులు అర్పించారు. నాయకులు వి ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కలాం చిత్ర పటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. అబ్దుల్ కలాం చేసిన సేవలను ఈ సందర్బంగా యువత కొనియాడారు. కాలం అందించిన సేవలకు గాను కలాం జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రవితేజ, నాగిరెడ్డి, మహేందర్‌రెడ్డ, ఆరీఫ్, దిగంబర్, సురేశ్, నారాయణ, మధు, అశోక్, జాష్వ తదితరులు పాల్గొన్నారు.



బీటిరోడ్లపై వరిధాన్యం ఆరబోసిన రైతులు

## రోడ్లపైనే వరిధాన్యం ఆరబోత-తరుచు ప్రమాదాలు

**అల్లాదుర్గం, నవంబర్ 11, ప్రభాతవార్త:** 161వ జాతీయ రహదారి పక్కనే బీటి స్లిప్ రోడ్డు వాటిపైనే వరధాన్యాల ఆరబోత.., వచ్చిపోయే వాహనదారులకు ఇబ్బందులు, తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దపూర్ నుండి రాంపూర్ వరకు, అక్కడక్కడ రోడ్లపై రైతులు తమ వరి ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. జాతీయ రహదారినుండి గ్రామాలకు వెళ్లే మలువు బీటి రోడ్లపై రైతులు వరి ధాన్యాన్ని ఎండబెడుతున్నారు. దీంతో తరుచుగా ఈ రోడ్డుగుండా వచ్చిపోయే వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత వరి సీజన్‌లో ధాన్యంను ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలవద్దకు తీసుకెళ్తే అక్కడ వరిధాన్యాన్ని శాంపిల్ రూపంలో తీసుకొని పరీక్షిస్తే తేమ శాతం ఎక్కువగా ఉందని వరిని ఆరబోసి తీసుకురావాలని అధికారులు తేలపడంతో రైతులు చేసేదిఏమిలేక ఈ వరిధాన్యాన్ని తేమ శాతం తగ్గించేందుకు హైవేరోడ్డు పక్కన స్లిప్ రోడ్లపై ఆరబోస్తున్నారు. రైతులు ఆరుకాలల పాటు కష్టపడి శ్రమించి వరిపంట పండించి తీరా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యాంకొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే అక్కడ ఉన్న సిసిలు తేమపేరుతో పంపిచడం రైతులకు తలనొప్పిగా మారింది. కొనుగోలు కేంద్రాలవద్దనే తాడిపత్రిలు, గొనెసంచులను ఇచ్చి ఆరబోసేందుకు స్థలం చూయిస్తే, రోడ్డుపై ధాన్యం ఆరబోసే విలుండదని, రాత్రివేళ్లలో రోడ్డుపై ఉన్న ధాన్యం కనబడకపోవడంతో ప్రమాధాలు సంభవిస్తున్నాయని ఈ ప్రమాదాలు అరికట్టలంటే రైతులకు కొనుగోలు కేంద్రాల వద్దనే వరి ఆరబోసేందుకు స్థలం కేటాయిస్తే బీటిరోడ్ల వద్దకు వెళ్లకుండా, కొనుగోలు కేంద్రాలవద్దనే వరిధాన్యాన్ని ఆరబోసుకుంటారని రైతులు తెలిపారు. అధికారులు కూడా రోడ్లపై వరధాన్యాం ఆరబోయనివ్వకుండా, ప్రమాధాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎడ్లరేగడి తాండలో వరికొనుగోలు కేంద్రం ప్రారంభం

**సంగారెడ్డి, నవంబర్ 10, ప్రభాతవార్త:** కంగ్టి మండల పరిధిలోని ఎడ్లరేగడి తాండలో శుక్రవారం నాడు వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కోటా ఆంజనేయులు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, తమపంటను కోతఅయిన తరువాత ఎండబెట్టి కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించి, పంటలను చివరిగింజవరకు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా తక్కువ ధరకు వద్దు అమ్ముకుండా వరి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు.సర్పంచ్ బళిరాం, ఎంపిటీసీ శ్రీకాంత్, ఐకెపి సీసీ రేణుక, డీలర్ నారాయణ, బాబుసింగ్, గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## భార్య రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

**అల్లాదుర్గం, నవంబర్ 11, ప్రభాతవార్త:** అల్లాదుర్గం భార్య రావడం లేదని మనస్థాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాండ్ల బావి గిరిజన తండాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం కల్హేర్ మండలం కొత్తచెరువు తండాకు చెందిన నున్సావంత్ శంకర్ (32), భార్య శాంతి, వీరికి ముగ్గురు సంతానం, శంకర్ ప్రతిరోజు మద్యం అతిగా సేవించేవాడు. భార్య భర్తల మధ్య కుటుంబ సమస్యలతో ఎప్పుడు గొడవలు పడుతుండేవారు. గత ఐదు రోజుల ముందు అత్తవారిల్లు అయిన గండ్లబాయి తండా భార్య శాంతి బాయిను తీసుకుపోతానని అత్త మామాలకు అడగ్గా వారు నిరాకరించడంతో శంకర్ గురువారం నాడు సాయంత్రం వేల ఇంటికిఆ వెళ్తానని చెప్పి మనస్థాపంతో గాండ్ల బావి గిరిజన తాండ శివారులో తన మామ వసూరం వ్యవసాయ భూమిలోని వేపచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

## లోక కళ్యాణం కోసం యాగాలు నిర్వహించడం అభినందనీయం

### పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**సంగారెడ్డి, నవంబర్ 11, ప్రభాతవార్త:** లోక కళ్యాణం కోసం యాగాలు నిర్వహించడం ఉప విషయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రశం సించారు. రాచంద్రాపురం మండల బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామచం ద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఏర్పాటుచేసిన శ్రీ రుద్ర సహిత శతచండీ మహాయాగంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ యాగం నిర్వహించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని అవరచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ పుష్ప నగేష్ యాదవ్, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, బ్రహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## భానూరి గోనయ్యగౌడ్‌ను పరామర్శించిన జెడ్పీటీసీ

**శివ్వంపేట, నవంబర్11 ప్రభాతవార్త:** శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన భానూరి గోనయ్యగౌడ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తన సహచరుల ద్వారా తెలుసుకున్న జిల్లా ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, శివ్వంపేట జెడ్పీటీసీ సభ్యులు మహేష్‌గుప్త శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గోనయ్యగౌడ్‌కు తన వంతు సహాయంగా 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మహేష్‌గుప్త మాట్లాడుతూ అందరితో కొలుపుగోలుగా ఉంటున్న గోనయ్యగౌడ్ అనారోగ్యం బారిన పడటం బాధాకరమని ఆయన అన్నారు. సర్పంచి పి. శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచి రాజిపేట పద్మా వెంకటేష్, నాయకులు పోచాగౌడ్, గౌరీశంకర్, భాసంపల్లి కృష్ణాగౌడ్, ముద్దగల్ల రాజు పాల్గొన్నారు.

### సేఫ్ యూజ్ ఆఫ్ పెస్టిసైడ్స్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ రైతు సమావేశాలు

అసోసియేషన్ ఆఫ్ పెస్టిసైడ్స్ మ్యానుఫ్యాక్చరర్స్ ఏపీ అండ్ తెలంగాణ (ఏపీఎంఏ) జాతీయ అంతర్జాతీయ ఖ్యాతి గడించిన 35 పురుగుల మందుల తయారీదారుల సంస్థ దీని సభ్యులు ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ సేఫ్ యూజ్ ఆఫ్ పెస్టిసైడ్స్ ప్రాముఖ్యతను తెలుపుతూ రైతు సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు స్థానిక వ్యవసాయాధికారులు,రైతులు అనుసరించాల్సిన భద్రతా చర్యల గురించి మాట్లాడారు. హనుమంత్ జెండగే,ఐఏఎస్ తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ ప్రత్యేక కమిషనర్, విజయ కుమార్,వ్యవసాయ అదనపు డైరెక్టర్ మోహన్‌రెడ్డి సమక్షంలో పురుగుల మందుల సురక్షిత వినియోగంపై ఎస్‌యూపీ చార్ట్ హ్యాండ్‌బిల్‌ను విడుదల చేశారు.



బిజెపిలో చేరి నినాదాలు చేస్తున్న యువకుల దృశ్యం

## బిజెపిలో వంద మంది యువకులు చేరిక

**సదాశివపేట, నవంబర్ 11, ప్రభాతవార్త:** మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి సమక్షంలో జిల్లా నాయకులు శివరాజ్‌పాటిల్ అధ్వర్యంలో వంద మంది యువకులు బిజెపిలో చేరారు. జిల్లా అధ్యక్షులు యువకులకు బిజెపి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ యువత నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులై బిజెపిలో చేరుతున్నామన్నారు. కులమతాలకు అతీతంగా బిజెపి ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తున్నారని తెలిపారు. జిల్లా నాయకులు శివరాజ్‌పాటిల్ మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గానికి శాసనసభ్యులు జగ్గారెడ్డి, మాజీ శాసనసభ్యులు చింతా ప్రభాకర్‌లు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఒకరు, ప్రజలకు అందుబాటులో లేకుండా మరొకరు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెమలికొండ వేణుమాధవ్, అసెంబ్లీ కన్వీనర్ నర్సారెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ కోవూరి సంగమేశ్వర్, జిల్లా కార్యదర్శి పార కృష్ణ, మండల అధ్యక్షులు అంబదాస్, ఓబిసి మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, యువ మోర్చ అధ్యక్షులు అంజియాదవ్ పాల్గొన్నారు.

## వన భోజనాలతో విద్యార్థుల్లో మనాసిక ఉల్లాసం

**-కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు**

**పాపన్నపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యతో పాటు విహారం యాత్రలు, వన భోజనలు చేస్తూ ఉండాల్సిన అవసరం ఉందని పాపన్నపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు అన్నారు. శుక్రవారం ప్రిన్సిపాల్ నర్సింలు ఆధ్వర్యంలో మండలంలోని అబ్లాపూర్ గ్రామ శివారులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తీక వన భోజనలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నర్సింలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ, రాష్ట్ర ప్రిన్సిపాల్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణకుమార్, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు రజిత, వెంకటేశం, అవినాష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాసులు, నాగేందర్, మహాలక్ష్మి,శిరీష, బాగ్యలక్ష్మి, సంతోష్‌కుమార్, రమేష్, నర్సింలు, అరుణ, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

## సృజనాత్మకతకు తొలిమెట్టు భాష

**పాపన్నపేట, నవంబరు 11, ప్రభాతవార్త:** భాష, సహజ వాతావరణంలో వికసిస్తుందని, సృజనాత్మకత సహజ రూపంలో సంక్రమిస్తుందని హైద్రాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రో-వైస్ ఛాన్సలర్ ఆర్ఎస్ సర్రాజు అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సస్ ఆధ్వర్యంలో దక్షిణ భారతంలో హింధీ భాష దశ-దిశ అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన చర్చా గోష్ఠిలో సర్రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అధికార భాషగా హిందీని 15 ఏళ్లలో గుర్తించాలన్న సంకల్పం రాజకీయ కారణాల వల్ల ఇప్పటికీ నెరవేరలేదన్నారు. దేశంలో అత్యధికంగా ప్రజలు మాట్లాడే భాషను ద్వితీయ బాషగా హిందీయేతర రాష్ట్రాలు బోధించాలని ఆయన అభిలషించారు. భారతీయ భాషల్లో సంస్కృతి ప్రతిఫలిస్తుందని,అందుకుఅన్ని భారతీయ భాషల వారు హిందీని సులువుగా అర్థం చేసుకోగలరని ఆయన పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం, వివిధతలో ఏకత భారతదేశ గొప్పతనమని, భిన్న భాషలు, విభిన్న సంస్కృతుల నిలయమని దక్షిణ భారత హిందీ ప్రచార సభలో ఉన్నత విద్య-పరిశోధన విభాగాధిపతి ప్రొఫెసర్ సంజయ్ ఎల్ మదార్ పేర్కొన్నారు. సమన్వయ కర్త డాక్టర్ పి రమేష్ బాబు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో ఆంగ్ల భాష విభాగాధిపతి ప్రొఫెసర్ డీఆర్‌పీ చంద్రశేఖర్, డాక్టర్ డి సురేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మున్సిపల్ ఛైర్‌పర్సన్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 11, ప్రభాతవార్త:** సంగారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొంగులవిజయలక్ష్మిరవి, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చింతా ప్రభాకర్ తో కలిసి శుక్రవారం సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యల గురించి వివరించేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్‌ను కలెక్టరేట్ లోని కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. మున్సిపాలిటీలోని వివిధ సమస్యల పరిష్కారం కొరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వార్డులోని శివాలయ దేవాస్థానం సమస్యను పరిష్కారించాలని కలెక్టర్‌ను కోరారు. వారి వెంటా కౌన్సిలర్లు, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

## మృతిచెందిన లక్ష్మా గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**సంగారెడ్డి, నవంబర్ 11, ప్రభాతవార్త:** రేగోడ్ కు చెందిన లక్ష్మా గౌడ్ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకోని వారి కుటుంబీకులను పరామర్శించిదేకు అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ శుక్రవారం నాడు వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మా గౌడ్ కుటుంబానికి అండగా ఉంటానని, మృతునికి ముగ్గురు ఆడబిడ్డలు, ఒక కుమారుడు ఉండగా వీరిలో ఇద్దరు ఆడబిడ్డల వివాహం జరుగగా, మరో ఆడ కూతురు వివాహానికి ఉందని, కుమారుడు సాయ గౌడ్ కు ఒక కుతూరు, ఒక కుమారుడు ఉండా కూతురు నెల రోజుల క్రితం మృతిచెందిందని, నెలలోపే ఇద్దరు మృతిచెందడంతో ఆ కుటుంబం తీవ్ర శోక సంద్రంలో మునిగిపోయిందని, మొడ దిక్కులేక పోషణ కరువై సహాయం కోసం ఆ కటుంబం ఎదురుచూస్తుందనే విషయాన్ని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తెలుసుకోని వారిన్ని ఓదార్చి, వారికి ధైర్యం చెప్పిడం జరిగిది. లక్ష్మా గౌడ్ మృతిపట్ల ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీనిచ్చారు. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ వెంట మండల నాయకులు గొల్ల శేఖర్, సంతోష్ రావు తదితరులు ఉన్నారు.

## ఉన్నత చదువుల కోసం పేద విద్యార్థులకు చేయూత

**శివ్వంపేట, నవంబర్11 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థులు శ్రీకాంత్, బాబుల ఉన్నత చదువుల గురించి తన వంతు సహాయంగా స్థానిక జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, మండల పరిషత్ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డిల చేతుల మీదుగా 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి సాన్వీ రమాకాంత్‌రెడ్డి, సార శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## కందిలో జాతీయ విద్యా దినోత్సవం

**-అబుల్ కలాంకు ఘన నివాళులు**

**కంది, నవంబరు 11, ప్రభాతవార్త:** అబుల్ కలాం జయంతిని పురష్కరించుకుని శుక్రవారం మండల కేంద్రమైన కందిలోని తెలంగాణ ఉర్దూ మీడియం రెసిడెన్సియల్ వసతి గృహంలో జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కలాం చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులు అర్పించారు. అబుల్ కలాం భారత దేశానికి అందించిన సేవలపై అతిథులు కొనియాడారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అవార్డులను అందచేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్, పాఠశాల ప్రిన్సిపాల్ సల్మా ఖాటూన్, కంది సర్పంచ్ విమల వీరేశం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మనూర్‌లో ప్రారంభమైన ఉర్సు ఉత్సవాలు

**మనూర్, నవంబరు 11, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూంలో శుక్రవారం ఉర్సు ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. గ్రామంలోని దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో జాతర ఉత్సవ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజైన శుక్రవారం గ్రామ స్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని దర్గాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**సంగారెడ్డి, నవంబరు 11, ప్రభాతవార్త:** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఐడిఏ బస్తీలో నివాసం ఉండే నేపాల్‌కు చెందిన చెబ్బిలాల్ ప్రమాదావశాస్త భవనంపై నుంచి పడి గుర్తువారం మృతి చెందాడు. నేపాల్ వాసి మృతి చెందినట్లు తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ నాయకులు, కేజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి భవన యజమాని నుంచి 3ల క్షల 50వేల రూపాయలను పరిహారంగా మృతుడి భార్య శారదా దేవికి అందించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు నేత, కౌన్సిలర్ చంద్రారెడ్డి, నాయకులు కేసర్ ధినానాథ్, నవీన్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

## రుద్రారం విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

**పటాన్‌చెరువు, నవంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని రుద్రారం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠవాలల్లో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విద్యా సమాగ్రిని అందచేశారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పెన్‌పెన్సిళ్లు, రబ్బర్లు, షార్పనర్లు, స్కేళ్లు పంపిణి చేసినట్లు గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఎస్టేట్ అధికారి డీవీఏ మోహన్‌లు పేర్కొన్నారు. గీతం హాస్పిటాలిటీ ఎగ్జిక్యూటివ్ జె మీనా, వెంచర్ డెవలప్‌మెంట్ సెల్ కోచ్ పార్థసారథి పాల్గొన్నారు.

## చెరుకు నరికే యంత్రంను ప్రారంభించిన మాజీ ఎంపి

**మనూర్, నవంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని తోర్నాల్ గ్రామంలో శుక్రవారం చెరుకు యంత్రాన్ని మాజీ పార్లమెంట్ సభ్యులు, టిపిసిసి ఉపాధ్యక్షులు సురేశ్‌కుమార్ శెట్కార్ పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. గ్రామానికి చెందిన మల్లికార్జున్ పాటిల్ కొనుగోలు చేసిన యంత్రాన్ని మాజీ ఎంపి ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా గ్రామాల రైతులు యంత్రాన్ని వినియోగించుకుని లబ్దిపొందాలని సురేశ్ శెట్కార్ సూచించారు. కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు శంకరయ్యస్వామి, నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, ఎంపిటిసి సభ్యులు పండరినాథ్, మాజీ సర్పంచ్ సంగారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు పురంజన్, లింగప్ప, శరణప్ప పాల్గొన్నారు.

# అభ్యంతరాలపై వెంచర్‌ను సందర్శించిన డిపిఓ

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 11, ప్రభాతవార్త:** సంగారెడ్డి మండలం కుల్పగూర్ గ్రామపంచాయతీ పరిధిలో చేపడుతున్న వెంచర్‌ను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ సందర్శించారు. ఎస్ఎస్ఎం డెవలపర్స్ పేరుతో చేపట్టిన వెంచర్‌పై గత జిల్లాపరిషత్ సమావేశంలో తాను లేవనెత్తిన అభ్యంతరాలను పురస్కరించుకొని వెంచర్‌ను అధికారులు పరిశీలించారని జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మెహమ్మద్ ముస్తాఫా తెలిపారు. ఈ సందర్భంగా డిపిఓ దృష్టికి తమ అభ్యంతరాలను మరోసారి వివరిస్తూ ప్రభుత్వ స్థలాన్ని కలుపుకొని వెంచర్ ఏర్పాటుచేస్తున్నారని, పదిశాతం స్థలాన్ని గ్రామపంచాయతీకి స్వాదీనం చేయలేదని, బెటర్‌మెంట్ ఛార్జీలు గ్రామపంచాయతీకి చెల్లించలేదని, బఫర్‌జోన్‌లో రోడ్లు వేస్తున్నారని డిపిఓ దృష్టికి తీసుకెళ్లారు. తమ అభ్యంతరాలపై పూర్తివిచారణ జరిపించాలని డిపిఓను సురేష్ మోహన్‌ను కోరారు. ఈ సందర్భంగా డిపివో మాట్లాడుతూ ఏడి ద్వార సర్వే చేయించి భూమిహద్దులు నిర్ధారణ చేయడం జరుగుతుందని, తరువాతనే సమస్య కొలిక్కివస్తుందని అన్నారు. భూమి కొలతల కొరకు సర్వే ఏడికి, ఇరిగేషన్ అధికారులకు లేఖాలు వ్రాయనున్నట్లు డిపిఓ తెలిపారు. వెంచర్‌ను సందర్శించిన వారిలో డిపిఓ సురేష్ మోహన్ తోపాటు డిఎల్పివో సతీష్‌రెడ్డి, ఏడి వినేష్, మండల సర్వేయర్ కోటేశ్వరరావు, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ముస్తాఫా, ఉపసర్పంచ్ తదితరులు ఉన్నారు.

### హాలీడేస్‌లో ప్రత్యేక బాలల దినోత్సవం

భారతదేశంలో అతిపెద్ద ఎమ్యూజ్మెంట్ పార్కు వండర్లా ప్రత్యేక ఆఫర్లను బాలల దినోత్సవం కోసం తీసుకువచ్చింది. దీనిలో భాగంగా టీనేజర్లు,యువత లేదంటే పెద్ద వయసు వ్యక్తులు వం దర్లా పార్కుకు చిన్న పిల్లల్లా డ్రెస్ చేసుకుని రావడంతో పాటుగా చైల్డ్ టిక్కెట్లో పార్కుల్లో వినోదం ఆస్వాదించవచ్చు. ఈ ఆఫర్ నవంబర్ 12 నుంచి 14 వరకు అందుబాటులో ఉంటుంది. సం దర్శకులు చైల్డ్ టిక్కెట్ అర్హత సాధించాలంటే వారు స్కూల్ యూనిఫామ్స్ దరించడంతో పాటుగా స్కూల్, కిడ్స్ ప్రోపర్టీలైన వాటర్ బాటిల్స్ స్కూల్ బ్యాగ్ (పాతశేలి) లాలీపాప్ క్యాండీ మొ దలైనవి వెంట తీసుకురావాలి.ఆ ఆఫర్ బెంగళూరు, కొచ్చి హైదరాబాద్ వండర్లా పార్కుల వద్ద అందుబాటులో ఉంటుంది.